సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ఏడాది పాలనలో.. ఏంమారింది? సూపర్ 6

◆ కూటమి పాలనకు సంవత్సరం పూర్తి
◆ ఏడాదిలో ఏ మార్పు వచ్చిందంటూ ప్రశ్నలు
◆ ఎన్నికల హామీల అమలు నామమాత్రమే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు 2024 జూన్ 4వ తేదీ వచ్చాయి. ఈ ఫలితాలు వచ్చి బుధవారం నాటికి సరిగ్గా ఏడాదవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి, జనసేన, బిజెపి కూటమికి వంద శాతం స్థానాలు లభించాయి. 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు కూటమికే దక్కాయి. అంతకు మునుపు అధికారంలోనున్న వైసిపికి ఒక్క స్థానం కూడా దక్కలేదు. ఈ రకంగా ఒకే పార్టీ అన్ని స్థానాలను జిల్లాలో దక్కించుకోవడం ఇదే ప్రథమం. 2014లో ఉరవకొండ, కదిరి అసెంబ్లీ స్థానాల్లో వైసిపి గెలుపొందగా, తక్కిన 12 స్థానాల్లో టిడిపి గెలిచింది. 2019లో చూస్తే ఉరవకొండ, హిందూపురం రెండు స్థానాల్లో టిడిపి గెలుపొంది, తక్కిన 12 స్థానాల్లో వైసిపి గెలుపొందింది. వీటన్నింటికీ భిన్నంగా 2024 ఎన్నికల్లో కూటమి అన్ని స్థానాల్లో విజయం సాధించింది.

ఏడాదిలో ఐక్యత ఏ మేరకు

టిడిపి, బిజెపి, జనసేన మూడు పార్టీలు కలసి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాయి. ఏడాది కాలంలో మూడు పార్టీల మధ్య ఐక్యత ఏ మేరకన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. జిల్లాలో బిజెపికి ధర్మవరం అసెంబ్లీ స్థానాన్ని కేటాయించారు. అక్కడి నుంచి సత్యకుమార్ పోటీ చేసి గెలుపొందారు. మంత్రి కూడా అయ్యారు. అక్కడి బిజెపి గెలిచిన తర్వాత స్థానికంగా టిడిపితో సఖ్యత అంతగా లేదన్నది వరుసగా జరుగుతున్న ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి సందర్భంలోనూ టిడిపి, బిజెపిల మధ్య ఘర్షణ బాహాటంగానే చోటు చేసుకుంటూ వస్తోంది. పట్టుకోసం రెండు పార్టీలూ పోటీ పడుతున్నాయి. తక్కిన నియోజకవర్గాల్లోనూ టిడిపి, బిజెపి, జనసేన నేతలకు పొసగడం లేదు. ఈ మూడు పార్టీల నడుమ అసంతృప్తుల మధ్యనే ఏడాది కాలం పూర్తయింది.

ఏడాదిలో జిల్లా అభివృద్ధి ఎంత.!?

ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని అందుకున్న టిడిపి కూటమి ప్రభుత్వం దేశంలోనే అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధికి ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకుందన్న చర్చ నడుస్తోంది. హంద్రీనీవా మొదటి దశ వైడనింగ్ చేపట్టింది. రెండో దశ లైనింగ్ చేపట్టింది. ఈ రెండింటిపైనా విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. హంద్రీ నీవా మొదటి దశ వెడల్పు ఆరు వేల క్యూసెక్కులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం 3800 క్యూసెక్కులకే పరిమితం చేసింది. రెండో దశ లైనింగ్ వద్దని చెబుతున్నారు. లైనింగ్‌తో భూగర్భ జలాలు పెరిగే అవకాశముండదని చెబుతున్నారు. ప్రభుత్వం తన నిర్ణయం మేరకు లైనింగ్ పనులను శరవేగంగా చేసుకుని పోతోంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణను పూర్తిగా విస్మరించింది. జిల్లాకు అత్యంత కీలకమైన ఈ కాలువ పరిస్థితి పూర్తిగా అధ్వాన్నంగా ఉంది. ఇవి కాకుండా తాగునీటి పథకాల పరిస్థితి దయనీయంగా మారింది. వాటి అభివృద్ధికి చర్యల్లేవు. ఇప్పటి వరకు ప్రకటించిన పరిశ్రమలు అత్యధికం సోలార్, పవన విద్యుత్ ఉత్పత్తికి సంబంధించే ఉన్నాయి. వీటి వలన రైతుల భూములు పెద్దఎత్తున కోల్పోవడం తప్ప ఉపాధి ఉండదు. ఉపాధి కల్పించే పరిశ్రమలు జిల్లాకు అవసరమని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.



ప్రకటనల్లోనే సూపర్-6

కూటమి నేతలు ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్-6 ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఈ హామీల్లో అత్యంత కీలకమైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏడాది కాలంగా అమలు కాలేదు. ఇందులో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవను ఈ నెలలో, ఉచిత బస్సును ఆగస్టులో అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇవి ఏ మేరకు అమలు జరుగుతాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రజలకు నేరుగా ఆర్థిక పరమైన లబ్ధి చేకూర్చే వాటిలో పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో పెంచిన పింఛన్లను క్రమం తప్పకుండా అందిస్తున్నా, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేతలో తడబాటు కొనసాగుతోంది.

నైరాశ్యం నుంచి కోలుకోని వైసిపి

ఈ ఏడాది కాలంలో చూసినప్పుడు వైసిపి ఇంకా నైరాశ్యం నుంచి కోలుకోలేదు. అన్ని స్థానాలను కోల్పోయి జిల్లాలో వైసిపికి ఒక్క ఎమ్మెల్యే లేకుండా ఉన్నారు. పార్టీ కూడా అధికారంలో లేకపోవడంతో కొన్ని నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జిలు స్తబ్దతతో ఉన్నారు. స్థానిక సంస్థల్లోని కొంత మంది నేతలు అధికార టిడిపిలో చేరిపోయారు. వారిని నిలువరించలేని స్థితిలో వైసిపి ముఖ్య నేతలున్నారు. ఇప్పటికే కదిరి, మడకశిరతోపాటు కొన్ని పురపాలక సంఘాల్లో టిడిపి అధికార పీఠాన్ని ఎక్కింది. ఈ స్థానాల్లో వైసిపి తమ వారిని గట్టిగా నిలుపుకోలేకపోయిందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఇకపోతే సంస్థాగతమైన మార్పుల ద్వారా పార్టీలో జవసత్వాలు నింపేందుకు చర్యలు కూడా అధిష్టానం చేపట్టింది. ఇవి ఏ మేరకు ఫలిస్తాయన్నది చూడాల్సి ఉంది.

వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు

◆ అధికారులు అన్ని విధాలా సిద్ధంగా ఉండాలి
◆ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకావం ఉన్న నేపథ్యంలో దానిని ఎదుర్కోవడానికి సంబంధిత అధికారులు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. రాబోయే మూడు నెలల కాలంలో కురవనున్న వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం స్థానిక కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్న, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదన్నారు. ఏవైనా అనుకోని ప్రమాదాలు సంభవిస్తే ఆ తర్వాత చేపట్టాల్సిన చర్యలకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఆర్డీవోలు వారానికి ఒకసారి డివిజన్ స్థాయిలో సమీక్షించి నివేదికను సిద్ధం చేయాలన్నారు. వర్షాలు కారణంగా చెరువులు, కాలువలకు ఎక్కడా గండ్లు పడకుండా నీటిపారుదల శాఖ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గండి పడే అవకాశాలు ఉన్నచోట ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపాల్టీ అధికారులు రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించి లోతట్టు ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లు కొట్టుకుని పోకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, పారిశుధ్యంపై దష్టి సారించాలన్నారు. పంచాయతీ శాఖ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి వర్షపు నీరు నిలువ లేకుండా, తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యశాఖ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, అన్ని రకాల మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వర్షాలు కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం స్తంభాలు, విద్యుత్ తీగలు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోయే అవకాశం ఉందని వీటికి సంబంధించి విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కల్వర్టులు, వంతెనలు, నీటి ప్రవాహాల వద్ద హెచ్చరిక బోర్డులు రెవెన్యూ శాఖ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం, డిపిఒ సమత, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, వ్యవసాయ శాఖ సుబ్బారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దేవాలయ భూములు అన్యక్రాంతం కాకుండా చూడాలి

దేవాదాయ భూములు అన్యక్రాంతం కాకుండా పరిరక్షించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేవాదాయ భూములు జిల్లాలో ఎక్కడెక్కడ ఎన్ని ఎకరాలు ఉన్నాయో తగిన నివేదికలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎండోమెంట్ అధికారి నరసింహారావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి విజయశాంతి, డిపిఒ సమతా పాల్గొన్నారు.

అధ్యాపకుల భర్తీకి కసరత్తు..!

నేడు విజయవాడలో విసి, రిజిస్ట్రార్లతో సమావేశం

ప్రజాశక్తి - అనంతపురం

యూనివర్సిటీల స్థాయిలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా అనంతపురం, కలికిరి, పులివెందుల జెఎన్‌టియులు, అనంతపురం జెఎన్‌టియు ఒటిపిఆర్ఐ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. అనంతపురం జెఎన్‌టియు పరిధిలో ఎక్కువ భాగం ఆడహక్ లెక్చరర్లతో విద్యాబోధన జరుగుతోంది. గత ప్రభుత్వం అధ్యాపకుల నియామకాల కోసం నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ కోర్టు పరిధిలోకి వెళ్లడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీన్ని అధికమించి ఈ విద్యా సంవత్సరంలో అధ్యాపకుల ఖాళీలు భర్తీ చేయాలని ఉద్దేశంతో అన్ని రకాల జాగ్రత్తలు ప్రభుత్వం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా బుధవారం నాడు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు వైస్‌ఛాన్సలర్లు, రిజిస్ట్రార్లతో ఉన్నత విద్యామండలి చైర్మన్ అధ్యక్షతన విజయవాడలో సమావేశం నిర్వహించనున్నారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల భర్తీకి తీసుకోవాల్సిన అంశాలపై దిశా, నిర్దేశం ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరయ్యేందుకు అనంతరం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ఆచార్య హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్యలు మంగళవారం సాయంత్రం విజయవాడకు వెళ్లారు.

అనంతపురం జెఎన్‌టియు

మందుబాబుల వీరంగం

రైతు సేవా కేంద్రం తలుపులు పగలగొట్టిన వైనం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని వెలిచలమల గ్రామ పంచాయతీ రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం అర్ధరాత్రి మందుబాబులు వీరంగం సృష్టించారు. సేవా కేంద్రం తలుపులు పగులగొట్టి రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన వేరుశనగ బస్తాలను దొంగలించే ప్రయత్నం చేశారు. కార్యాలయంలో మద్యం సేవించి బాటిళ్లను అక్కడే పగులగొట్టారు. జరిగిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని ఏవో లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. కార్యాలయం ఆస్తులు ఏమి ధ్వంసం కాలేదని పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ అలీ తెలిపారు.

రైతు సేవాకేంద్రం తలుపు విరగ్గొట్టిన దృశ్యం

90 శాతం సబ్సిడీతో వేరుశగన ఇవ్వాలి

ప్రజాశక్తి - గోరంట్ల

90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశగను రైతులకు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల అభివృద్ధి అధికారి రాజేంద్ర కుమార్‌కు మరియు వ్యవసాయ అధికారి మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు 90 శాతం సబ్సిడీతోఅయిదు బస్తాలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు ఉపాధి కూలీలకు ప్లే సిప్ లతోపాటు బకాయి బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు మండలంలోని రెడ్డి చెరువు పల్లి గ్రామంలో ఆరు రోజులు పనిచేసిన దానికి ఉపాధి కూలీలకు ఒక్కొక్కరికి 120 రూపాయలు మాత్రమే కూలి పడుతోందన్నారు ఈ విషయంపై ఎంపీడీవో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్లేస్లిప్‌లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కొండా వెంకటేష్, మండల నాయకులు నంజుండప్ప, కోశాధికారి బాబాజాన్, ఉపాధ్యక్షులు మహమ్మద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం

అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సూర్యనారాయణ

సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడమే లక్ష్యమని అసిస్టెంట్ కమిషనర్ సూర్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో బాల కార్మిక నిర్మూలన టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన పోలీస్ శాఖ, విద్య, ఐసిడిఎస్, కార్మిక శాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ టాస్క్‌ఫోర్స్ కమిటీలోని అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా మార్చాలన్నారు. 14 ఏళ్ల వయసులోపు ఉన్న బాల బాలికలు బడిలో ఉండాలే తప్ప బాల కార్మికులుగా ఉండరాదన్నారు. దుకాణాలు, హోటళ్లలో విస్తృతంగా నిర్వహించి బాల కార్మికులను గుర్తించాలన్నారు. ఎక్కడ బాలలు కార్మికులుగా ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ సంస్థ చైర్మన్ భానుజా, సమత, ఎన్జీవో ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించుకోండి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని వార్డుల్లోని ప్రజలు మురుగు కాలువలపై ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. వార్డు పర్యటనలో భాగంగా మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీలతో కలిసి మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్ ఆజాద్ నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆజాద్ నగర్‌లో రహదారులు, మురుగు కాలువలు, పారిశుధ్యం, వీధి దీపాలు, నీటి సమస్యల గురించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్డులో ఉన్న డ్రయినేజీల నుండి వస్తున్న నీరు అంతా పెద్ద కాలువలో కలుస్తూ, అక్కడి నుండి చెరువు కాలువకు అనుసంధానం అయ్యే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. చాలా చోట్ల కాలువల పైన నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తే ఆ కాలువలలోని సిల్ట్ ను తొలగించడానికి వీలుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జబీవుల్లా, టీడీపీ నాయకులు బుల్లెట్ జియా, అన్వర్, రియాజ్, నయాజ్, ఇంచార్జీ ఎంఇ. దస్తగిరి, ఎసిపి చంద్రమ్మ, ఏఈ. శంకర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, సచివాలయ సిబ్బంది, బూత్ కన్వీనర్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీ నిధుల వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి-పెనుకొండ

ఎంపీ లాండ్స్ నిధులు వినియోగంపై హిందూపురం ఎంపీ బి.కె.పార్థసారథి మంగళవారం ఆర్అండ్ బి అతిథిగృహం లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ తదితర శాఖల అధికారులతో ఎంపీ చర్చించారు. నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ఎలాంటి పనులు అవసరమో నివేదికలు తయారు చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు విజయ్ కుమార్, పిఆర్ ఈఈ మురళి, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహమూర్తి, ఆర్డబ్ల్యూఎస్, పిఆర్ డీఈలు ఏఈలు, మున్సిపల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ పార్థసారథి

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి - పావగడ

పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల ట్రస్ట్ పి బి వెంకటేష్ అన్నారు. పవరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను ఎక్కువగా పెంచడం వల్ల మంచి ఆక్సిజన్ అందుతుందని అన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో మొక్కలు నాటే అలవాటును పెంపొందించుకోవాలని, ఇంటి ముందు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని మొరంపల్లి గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త శ్రీనివాసులు ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ ఘటనపై జనసేన పార్టీ మృతుని కుటుంబానికి రూ.5లక్షల పరిహారం అందించింది. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ నాగబాబు చేతుల మీదుగా ఈ సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ హిందూపురం ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్, మండల అధ్యక్షుడు చిన్న ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తలుపులలో 'మన ఇంటికి మన ఎమ్మెల్యే'

ప్రజాశక్తి - కదిరి టౌన్

తలుపుల మండలంలోనిపెద్దన్నవారిపల్లి పంచాయతీలో బుధవారం ఉదయం 10 గంటలకు మన ఇంటికి మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించనున్నారని టిడిపి నాయకులు తెలిపారు. తలుపుల మండలంలోని పెద్దన్నవారి పల్లి పంచాయతీ సంగటి వారి పల్లి గ్రామం నుంచి ప్రారంభించి వేముల గొంది,ఎస్.వడ్డిపల్లి,కొటాల, మైరాడ, గ్రామాలలో మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం కొనసాగునుంది. భోజన విరామం అనంతరం సాయంత్రం కాయలపల్లి,చిన్నన్నవారిపల్లి, చిన్నపల్లి, దళితవాడలో ఎమ్మెల్యే పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని నాయకులు తెలిపారు.

విలేకరులు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన

-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-

శ్రీ సత్యసాయి జిల్లా: రామగిరి, మడకశిర రూరల్, ధర్మవరం, హిందూపురం రూరల్, కనగానపల్లి, అమరాపురం

ఇంటర్వ్యూ : తేది: 09-06-2025 సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో జరుగును.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099311,9490099312,318

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, కదిరి
దావా నెం.175/2024

Between:
పఠాన్ నసీమ W/o పి.ఫక్రుద్దీన్, వయస్సు 58 సం॥లు, ముస్లిమ్, వ్యాపారము, R/o D.No:9-276, పైల్వాన్ ఆమీర్ వీధి, రాయచోటి రోడ్డు, కదిరి మునిసిపాలిటీ, కదిరి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

ఎదిరి

మొహల్ గంగాదేవి అలియాస్ పర్వీన్ భాను మరియు 4 ఇతరులు
1.మొహల్ ఫీరోజ్ ఖాన్ S/o లేట్ మహల్ కిజర్ ఖాన్, ముస్లిమ్, వయస్సు 30 సం॥లు, వ్యాపారం, R/o D.No:3/94, కుమ్మరవాండ్లపల్లి (వి) కదిరి రూరల్, కదిరి (మం), శ్రీ సత్యసాయి జిల్లా. ...3వ ప్రతివాది
2.మొహల్ యాస్మీన్ D/o లేట్ మొహల్ కిజర్ ఖాన్, ముస్లిమ్, వయస్సు 28 సం॥లు, వ్యాపారం, R/o D.No:3/94, కుమ్మరవాండ్లపల్లి (వి) కదిరి రూరల్, కదిరి (మం), శ్రీ సత్యసాయి జిల్లా. ...4వ ప్రతివాది

పై దావాలో 3 మరియు 4వ ప్రతివాదులకు దావా సమన్సు

పై దావాలో పైన తెల్పిన కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా తేది 20-06-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు, మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోగలరు. అట్లు హాజరు కాని యెడల పై దావాను మీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:20/06/2025
స్థలం : కదిరి

ఇట్లు
ఎ.క్రిష్ణమూర్తి,MA, LLB,
వాదితరుపు న్యాయవాది,
కదిరి, శ్రీసత్యసాయి జిల్లా
సెల్:9440310692, 8886389692

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, కదిరి
దావా నెం.736/2024

Between:
1.ఒంటిగారి గంగిరెడ్డి, వయస్సు 65 సం॥లు, S/o లేట్ ఒంటిగారి పెద్దఓబులేసు
2.ఒంటిగారి గంగులయ్య వయస్సు 62 సం॥లు, S/o లేట్ ఒంటిగారి పెద్దఓబులేసు, 1 & 2 హిందూ, వ్యవసాయము, R/o D.No:6-66, స్వబ్బనగుంతపల్లి (వి), H/o ఓదులపల్లి, తలుపుల (మం), శ్రీ సత్యసాయి జిల్లా.
3.ఒంటిగారి ఓబులపతి S/o లేట్ చిన్న ఓబులేసు వయస్సు 45 సం॥లు, హిందూ, వ్యవసాయము, R/o D.No:6-60, స్వబ్బనగుంతపల్లి (వి), H/o ఓదులపల్లి, తలుపుల (మం), శ్రీ సత్యసాయి జిల్లా. ...వాదులు

ఎదిరి

గుజ్జల పెద్ద ఓబులపతి మరియు 7 మంది ఇతరులు
3వ ప్రతివాది: గుజ్జల గంగప్ప S/o లేట్ గుజ్జల గంగన్న @ గంగప్ప వయస్సు 45 సం॥లు, హిందూ, వ్యవసాయము, R/o D.No:6-40, ఎస్.రాచువారిపల్లి (వి), H/o ఓదులపల్లి, తలుపుల (మం), శ్రీ సత్యసాయి జిల్లా. ...3వ ప్రతివాది

పై దావాలో 3 వ ప్రతివాదికి దావా సమను

పై దావాలో పైన తెల్పిన కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా తేది 15-09-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు, మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోగలరు. అట్లు హాజరు కాని యెడల పై దావాను మీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:15/09/2025
స్థలం : కదిరి

ఇట్లు
ఎ.క్రిష్ణమూర్తి,MA, LLB,
వాదులతరుపు న్యాయవాది,
కదిరి, శ్రీసత్యసాయి జిల్లా
సెల్:9440310692, 8886389692

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, కదిరి
దావా నెం.739/2023

Between:
కుంచపు రత్నమ్మ W/o లేట్ కె.రామచంద్ర, వయస్సు 48 సం॥లు, హిందూ, కూలి, R/o D.No:1-32, వడ్డివారిపల్లి (వి), ముక్కండ్లవారిపల్లి (గ్రామం), ఓ.డి.చెరువు (మం), శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

ఎదిరి

సిరిగిరెడ్డి శేఖర్‌రెడ్డి మరియు ఇతరులు ...వాదులు
సిరిగిరెడ్డి శేఖర్‌రెడ్డి S/o లేట్ ఎస్.సుబ్బారెడ్డి, వయస్సు 35 సం॥లు, హిందూ, వ్యవసాయము, R/o D.No:1-15, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వీధి, ఓ.డి.చెరువు (మం), శ్రీ సత్యసాయి జిల్లా. ...1వ ప్రతివాది

పై దావాలో 1వ ప్రతివాదికి దావా సమను

పై దావాలో పైన తెల్పిన కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా తేది 27-06-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు, మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోగలరు. అట్లు హాజరు కాని యెడల పై దావాను మీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:27/06/2025
స్థలం : కదిరి

ఇట్లు
ఎ.క్రిష్ణమూర్తి,MA, LLB,
వాదితరుపు న్యాయవాది,
కదిరి, శ్రీసత్యసాయి జిల్లా
సెల్:9440310692, 8886389692

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, కదిరి
దావా నెం.168/2024

Between:
గోరంట్ల ప్రసాద్ S/o లేట్ చెంగల రాయప్ప, వయస్సు 60 సం॥లు, హిందూ, వ్యాపారం, వ్యవసాయం, R/o D.No:5-111, బొగ్గలపల్లి (వి), గోపేపల్లి (పోస్టు) నల్లమాడ (మం), అనంతపురం జిల్లా. ప్రస్తుతం:శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

ఎదిరి

షేక్ రఫీక్ S/o షేక్ ఆలమ్ సాబ్, వయస్సు 59 సం॥లు, ముస్లిమ్, వ్యాపారము, R/o D.No:1-75-11, మోహియార్ నగర్, కదిరి టౌన్ & పోస్టు & మండలం, అనంతపురం జిల్లా. ప్రస్తుతం:శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది

పై దావాలో ప్రతివాదికి దావా సమను

పై దావాలో పైన తెల్పిన కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 18-06-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు, మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోగలరు. అట్లు హాజరు కాని యెడల పై దావాను మీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:18/06/2025
స్థలం : కదిరి

ఇట్లు
ఎ.క్రిష్ణమూర్తి,MA, LLB,
వాదితరుపు న్యాయవాది,
కదిరి, శ్రీసత్యసాయి జిల్లా
సెల్:9440310692, 8886389692

In the court of the Hon'ble prl. District Judge Anantapuramu
G.W.OP. No:15/2025
(In the matter of appointment of guardian to the person and property of minor, Chakrika DK, aged about 11 years and permission to sell the petition)

Between:
Dalavayee Kodandapani S/O Dalavayee Veeranna. Age 59 years Hindu. residing at D.No. B-204 Concept Nest, Hosekerahalli Main Road Ganapathi nagar, VTC Bangaloru South, Bengaluru, karnataka ...Petitioner

V/S

Nil. ...Respondants

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడము ఏమనగా పై నెంబరు కేసులో మైనరు అయిన Chakrika DK కు సంబంధించి ఆస్థిని అమ్ముటకు పై కోర్టులో అర్జీ దారుడు అర్జీ దాఖలు చేసి యున్నారు. సదరి కేసు 19-06-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు ఎవరికైనా ఆక్షేపణలున్నచో స్వతహాగా కానీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేని యెడల పై కేసు అర్జీ దారుని పరముగా తీర్మానింతురని తెల్పడమైనది.

SCHEDULE

Property situated in R.D of Hindupuramu the then Anantapuramu, now Sri Satya Sai District and S.R.D of Hindupuramu Municipality limits. **BABU**-NATURE : **Govt**-Dry, **Sy.No**:271-1 A out of it 0-54 Cents out of it 0-10 cents opensite within the following **boundaries**:**East**: land of Gopal in the same Survey Number **West**: Konduru Govindappas land **North**: Rastha leaved by me and my remaining land in the same survey Number

(By Order of the Court)
G.Pullaiah (Babu), Advocate,
Ananthapuram. Cell: 9492751019.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు..!

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కుటుంబ కలహాలతో చిత్రావతి నదిలో దూకి ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తి ప్రాణాలను పుట్టపర్తి పోలీసులు రక్షించారు. సోమవారం రాత్రి పుట్టపర్తిలో నివాసం ఉంటున్న కలకత్తాకు చెందిన రాజేష్ శర్మ అను వ్యక్తి ఆత్మహత్య చేసుకునేందుకు చిత్రావతి నదిలో దూకాడు. అయితే ఆ ప్రాంతంలో ఉన్న కొందరు యువకులు, చిత్రావతిలో దూకిన వ్యక్తి సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని నీటి మధ్యలో మునుగుతూ తేలుతూ ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న రాజేష్ శర్మను తన సిబ్బంది అక్కడ ఉన్న యువకుల సహకారంతో రక్షించారు. బోటులో వెళ్లి నది మధ్యలో ఉన్న రాజేష్ శర్మను బయటికి తీసుకువచ్చారు. అతనిని పోలీస్ స్టేషన్ తీసుకువెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. తమ వారిని కాపాడి ప్రాణాలు రక్షించిన పోలీసులకు, పట్టణ యువకులకు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఒక వ్యక్తి ప్రాణాలను రక్షించడంలో వెంటనే స్పందించిన పోలీసుల తీరుపై పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు. సమాచారం వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని వ్యక్తి ప్రాణాలను కాపాడిన సిఐ, ఎఎస్ఐ, సిబ్బంది, యువకులను జిల్లా ఎస్పీ వి. రత్న, డీఎస్పీ విజయ్ కుమార్ అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న అధికారి

వేరుశనగ నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని బూదిలి పంచాయతీ గ్రామ సచివాలయానికి మంగళవారం సబ్సిడీ వేరుశనగ బస్తాలు వచ్చాయి. విత్తన కాయల నాణ్యతను టిడిపి స్థానిక నాయకులు పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలని అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రభు శంకర్, భూపాల్ రెడ్డి, రామచంద్ర, ధనుంజయ నాయక్, అంజి తదితరులు పాల్గొన్నారు

విత్తన కాయల నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

నాణ్యమైన విత్తనాలను అందించండి

ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

నాణ్యమైన వేరుశనగను రైతులకు అందించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. చెన్నేకొత్తపల్లిలో వేరుశనగ నిల్వ ఉంచిన గోదామును ఆమె మంగళవారం పరిశీలించారు.కొన్ని బస్తాలను తెరచి విత్తనం నాణ్యతను పరిశీలించారు. 1910క్వింటాళ్లు విత్తనం వేరుసెనగ రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 500క్వింటాళ్లు వేరుసెనగ గోదాయుకు చేరిందని అధికారులు వివరించారు. అయితే ఒక బస్తాలో ఐదారు రకాల విత్తనం కలిసిందని ఓ రైతు ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకురాగా.. వెంటనే ఆ బస్తాను కింద పోయించారు. ఒక్కో రకం విత్తనం వేరుగా చేసి.. వాటిని జిల్లా కలెక్టర్ కు పంపుతున్నట్టు తెలిపారు. ఇలాంటి విత్తనం వచ్చిన 907అనే లాట్ ను పూర్తిగా వెనక్కు పంపాలని అధికారులను ఆదేశించారు. నాణ్యత లేకుంటే రైతులెవరు విత్తనం తీసుకోవద్దన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలోని పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి నాయకులు కోరారు. ఈ మేరకు ఆసంఘం నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు వినోద్ కుమార్ మాట్లాడుతు కార్మికులు మృతి చెందితే వారికి న్యాయంగా ఇవ్వాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేక పోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని మండిపడ్డారు. వెంటనే బెనిఫిట్స్ చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. 220 మంది కార్మికులకు చెందిన పిఎఫ్, ఈఎస్ఐ నిధుల్లో రూ. 4.94 లక్షలు సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్రంగా విచారణ జరపాలన్నారు. దీంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి రెడ్డి, చలపతి, ముత్యాలప్ప, కార్యదర్శి సిద్ధగిరి సురేష్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి వెంకట చిరంజీవి ఆధ్వర్యం లో ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మలేరియా నివారణ పైన అవగాహన కల్పించారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభం అయినందు వలన మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ సుబ్రమణ్యం, భాగ్యలక్ష్మీ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు

లేపాక్షి : మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు చేరాయి. మొదటి విడతలో భాగంగా ఎంఆర్‌సి నుంచి 41623 పుస్తకాలకు గాను 28325 పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేశారు. అలాగే 5604 మంది పిల్లలకు యూనిఫామ్, 5505 షూస్, 38040 నోటు పుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేశామని ఎంఇఒ నాగరాజు నాయక్ తెలిపారు.

'వెన్నుపోటు దినం'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి బత్తలపల్లి

కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు నిరసనగా వైసిపి అధిష్టానం పిలుపు మేరకు ఈనెల 4న వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు వైసిపి నియోజకవర్గ కల్చరల్ కమిటి ప్రెసిడెంట్ షరాబ్ యోగానంద ఆచారీ, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 4వ తేదీన ధర్మవరం పట్టణంలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మద్దతుగా భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

కొత్తచెరువు :ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా వైసిపి అధిష్టానం పిలుపుమేరకు బుధవారం వెన్నుపోటు నిరసన కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించడం జరుగుతుందని వైసిపి మండల కన్వీనర్ శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. ఉదయం కొత్తచెరువు మార్కెట్ యార్డ్ నుండి పుట్టపర్తి వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జగన్‌ను మించిన వెన్నుపోటుదారుడు లేరు

టిడిపి ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డికి మించిన వెన్నుపోటు దారుడు మరెవరు ఉండరని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. మంగళవారం బత్తలపల్లి మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంతో క్రమశిక్షణగా ఉండాలన్నారు. ఎక్కడ ఇబ్బందులు కలిగించకుండా కూలీలకు పనులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే కచ్చితంగా ప్రభుత్వం వైపు నుంచి చర్యలు ఉంటాయన్నారు. మరోవైపు వైసీపీ నాయకులు వెన్నుపోటు దినమంటూ చేపట్టిన కార్యక్రమంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత బాబాయికి గొడ్డలి పోటు వేసి కుటుంబం నుంచే వెన్నుపోటును ప్రారంభించారని ఆరోపించారు. సొంత చెల్లికి, తల్లికి న్యాయం చేయకుండా తన స్వార్థాన్ని చూసుకున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అంటూ విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసుకున్నారన్నారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను ఐదేళ్లపాటు మోసం చేసి దగా చేసిన జగన్ రెడ్డికి ఇప్పుడు మాట్లాడే అర్హత కూడా లేదని శ్రీరామ్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడుతూ ఓవైపు అభివృద్ధి.. ఇంకోవైపు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఈ ఏడాది కాలంలోనే 70శాతం హామీలు నెరవేర్చి.. ప్రజలకు ఒక మంచి పాలన అందిస్తుంటే.. దొంగే దొంగ ఉన్నట్టుగా వైసిపి వెన్నుపోటు దినం కార్యక్రమాలు నిర్వహిస్తోందని శ్రీరామ్ ఎద్దేవా చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్న వైసిపికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి నాగభూషణ, ముల్లగురి అయ్యప్ప, సురేంద్ర నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు వారి పేర్లను మండలంలోని సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో ఓబిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 1500 క్వింటాలు విత్తన వేరుశనగ కేటాయించారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బుక్కపట్నం :సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాల వద్ద తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి సతీష్ బాబు తెలిపారు. మండలానికి ఖరీఫ్ సీజన్ కింద 968 క్వింటాళ్ల కే6 రకం వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు.

నిరుపయోగంగా టిటిడి కళ్యాణ మండపం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులోని పుట్టపర్తి రోడ్డులో గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన టిటిడి కళ్యాణమండపం నిరుపయోగంగా మారింది. కొన్ని సంవత్సరాలపాటు ఇక్కడ వివాహాలు అధికంగా జరిగేవి. ఇప్పుడు వసతి సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. దీంతో ఈ కళ్యాణ మండపం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. నాలుగు రోడ్ల కూడలికి సమీపంలోనే ఈ కళ్యాణమండపం ఉన్నందున వివాహాలకు ఉపయోగకరంగా ఉంటుంది. టీటీడీ వారు పట్టించుకోకపోవడంతో ఇది నిరుపయోగంగా మారింది. సంబందిత నిర్వాహకులు స్పందించి మరమ్మతులు చేయించి కళ్యాణ మండపాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - లేపాక్షి

మండలం పరిధిలోని కంచిసముద్రం సెక్టర్ పరిధిలోని కిషోరి బాలికలకు పౌష్టికాహారం, ఉపయోగాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జయమ్మ మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న బాలికలు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కిషోరి బాలికలు పౌష్టికాహారం తీసుకోవటం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రూప, శశికళ, సెక్టర్ పరిధిలోని అంగన్వాడీ సిబ్బంది, కిషోరి బాలికలు పాల్గొన్నారు.

ఎడిసిసిబి చైర్మన్‌గా 'ముంటిమడుగు' బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం

ఎడిసిసి బ్యాంక్ నూతన ఛైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆయన సోమవారం నగరంలోని ఎడిసిసి బ్యాంక్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు సిఇఒ శ్రీధర్‌చౌదరి, నెట్టెం వెంకటేష్, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

గాంధీ విగ్రహానికి ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాలో ప్రస్తుతం నిర్వహి స్తున్న ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీల్లో ఉమ్మడి అనంత పురం జిల్లాలోని ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని కోరుతూ నగరంలోని మొదటి రోడ్డులో ఉన్న శారద నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో ఎస్‌టియు ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ఆరో రోజుకు చేరింది. ఇందులో భాగంగా మంగళవారం వారు టవర్ క్లాక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ 2023లో తాత్కాలిక పద్ధతిలో ఇచ్చిన 230 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఉద్యోగోన్నతుల ఖాళీలు తేల్చాలని, డీఎస్సీలో 30శాతం కోటాకు గానూ 103 పోస్టులు కేటాయిం చాలని, ఉద్యోగోన్నతులకు 70 శాతం కోటా ఇవ్వా లని, లేనిచో ధర్నా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సూర్యుడు, కోనంకి చంద్రశేఖర్, జయపాల్ నాయుడు, నరసింహులు, యుటిఎఫ్ నాయకులు లింగమయ్య, గోవిందరాజులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఫీఉద్దీన్, అంజినాయక్, ఆప్టా జిల్లా నాయకులు గోపాల్‌రెడ్డి, పీరునాయక్, వన్నారెడ్డి, సి.సూర్యనా రాయణ, ఓబిరెడ్డి, ఆదినారాయణ, బి.సూర్యనారా యణ, నరసింహారెడ్డి, మురళి, భాస్కర్, మధుసూ దన్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సత్యప్రసాద్, శంకరమూర్తి, సురేష్, పీజీ లక్ష్మీనారాయణ, ఆదిశేషయ్య, నాగరాజు, మధు, ఆరుడప్పా, రమేష్, బి.శేషగిరి, శ్రీరాములు, ధనలక్ష్మి, ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఘర్షణ.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తడంతో నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటన బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామంలోని చిన్న కొట్టాలలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈదుల ముష్టూరు గ్రామంలోని చిన్న కొట్టాలలో ఏడుగురు అన్నదమ్ములకు గాను నలుగురు అన్నదమ్ములు వీరయ్య, చిన్నప్ప, శివయ్య, గాలెప్ప సర్వే నెంబర్ 300లో భూమిని 40 సంవత్సరాల క్రితం భాగపరిష్కారాలు చేసుకున్నారు. అందులో 390-16లో 75 సెంట్లు, 300-12లో 50 సెంట్లు భూమిని చిన్నప్ప అనుభవిస్తున్నారు. చిన్నప్ప మరణానంతరం ఆయన కుమారులు శివప్రసాద్, గోవర్ధన్ సాగు చేసుకుంటున్నారు. అయితే గత పది సంవత్సరాలు నుంచి భూములు మార్పిడి చేయాలని వీరయ్య, శివయ్య. గాలెప్ప కుమారులు ఒత్తిడి తెస్తూ పట్టాలు మార్చడానికి ప్రయత్నించారు. ఇందుకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సూర్యప్రకాష్ రావు అండతో దౌర్జన్యం చేస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. సూర్యప్రకాష్ రావు పంచాయతీ చేసేందుకు ఆహ్వానించినా తాము నిరాకరించినట్లు బాధితులు తెలిపారు. దీంతో తహశీల్దార్‌పై ఒత్తిడి తీసుకువచ్చి మంగళవారం ఎలాగైనా సర్వే జరిపించాలని ప్రయత్నించగా తాము అభ్యంతరం తెలపడంతో వారు వెనుదిరిగినట్లు తెలిపారు. ఆ తరువాత శివయ్య, రమేష్, ఈడయ్య, శివశంకర్, గాలెప్ప అలియాస్ బాలు, సుకన్య కలిసి తమ భూమిలో హద్దు రాయిని దౌర్జన్యంగా తొలగిస్తుండగా తాము సెల్‌ఫోన్లో వీడియో తీస్తుండగా వారు తమపై కట్టెలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో శివప్రసాద్, గోవర్ధన్, ఈశ్వరమ్మ, నందినికి గాయాలైనట్లు తెలిపారు. దీనికంతటికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సూర్యప్రకాష్ రావు కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు. కావున టీడీపీ నాయకుడు పైన, దాడికి పాల్పడిన వారిపైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. అదేవిధంగా తమకు వారి నుంచి ప్రాణహాని ఉందని పోలీసులకు చెప్పినా తమకు రక్షణ కల్పించకపోగా, న్యాయం చేయడంలేదని వారు ఆరోపిస్తున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని జిల్లా ఎస్పీ, ధర్మవరం డిఎస్పీ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. బాధితులు గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - పావగడ

పావగడ తాలూకాలోని చన్నమ్మారెడ్డి గ్రామ సమీపంలోని పొలంలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. చెన్నమ్మారెడ్డి హళ్లి గ్రామానికి చెందిన రైతు లక్కప్ప(65) చెట్టుకు ఉరివేసుకుని మృతిచెంది ఉండటాన్ని సోమవారం సాయంత్రం గొర్రెల కాపరులు చూశారు. ఈ విషయాన్ని మృతుని కుటుంబీకులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న డీవైఎస్పీ మంజునాథ్, ఎస్పీ అశోక్, సీపీఐ సురేష్, సిబ్బంది ఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని అప్పలవాండ్లపల్లి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు డీ కొన్న ప్రమాదంలో హోంగార్డు రాంప్రసాద్ రెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. అనంతపురం ఎస్పీ ఆఫీసులో పనిచేస్తున్న హోంగార్డు రాంప్రసాద్ రెడ్డి తన మిత్రుడు రవితో కలిసి పెనుగొండకి తన సొంత పనుల మీద ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. ఈ సందర్భంలో కొత్తచెరువు లక్ష్మి సినిమా థియేటర్ పనిచేస్తున్న సిబ్బంది బండ్లపల్లి నుంచి ద్విచక్ర వాహనం లో వస్తు వీరి వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రాంప్రసాద్‌రెడ్డి కాలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సురేష్ తెలిపారు.

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ... పలువురికి గాయాలు

ప్రజాశక్తి తనకల్లు

మండల పరిధిలోని గంగసానిపల్లి వద్ద మంగళవారం జరిగిన ఆర్టీసీ బస్సు లారీ ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలు అయ్యాయి. లారీ, ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన కుమార్, ఉత్తన్న రామాంజులు, నారాయణ, వెంకటరమణను 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

నీటి తొట్టెలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని ముత్యాల వాండ్లపల్లికి చెందిన నాలుగు సంవత్సరాల బాలుడు నీటితొట్టెలో పడి మృతిచెందాడు. గ్రామానికి చెందిన సంధ్యారాణి, గిరీష్ దంపతుల కుమారుడు నిశాంత్ (4) మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఆడుకోవడానికి బయటకు వెళ్ళాడు. తల్లిదండ్రులు బాలుడు ఆడుకుంటున్నాడని భావించారు. మధ్యాహ్నం అయినా బాలుడు కనిపించకపోవడంతో గ్రామంలో వెతికారు.ఎక్కడా కనబడలేదు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల గల నీటి సంపులో బాలుడు కన్పించాడు. దీంతో బాలుడిని తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు, అయితే నిశాంత్ అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. బాలుడి మృతితో కుటుంబసభ్యులు చేస్తున్న రోదనలు చూపరులను కంటతడిపెట్టించాయి.

యోగా విశిష్టతను తెలుసుకోవాలి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

యోగా విశిష్టతను ప్రతి ఒక్కరు తెలుసుకొని యోగా చేయడం అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన యోగా విశిష్టతను వాటి ప్రాముఖ్యతను వివరించారు. బుధవారం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బహుద్దీన్, నాగేంద్రప్రసాద్, జిలాన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపిడిఒ సరస్వతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో యోగాంధ్రపై వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీలను ఈవోఆర్డీ శివ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాస రచన పోటీల్లో గగన్ సాయి ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంపిడిఒ సరస్వతి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు యోగ సాధన ద్వారా శరీరానికే కాకుండా మనస్సుకు కూడా ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. యోగ సాధనను నిత్య జీవితంలో మలుచుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా, చురుకుగా జీవించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సంతేబిదనూరు ఆయూష్ ఆసుపత్రి వైద్యురాలు అనురాధ, సెక్రటరీ కెంచరాయప్ప, యోగా శిక్షకులు సూర్యకృష్ణ, శిల్పరాణి, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు